క్లుప్తంగా

నేడు వైద్యశిబిరం

శ్రీకాళహస్తి: ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం పురపాలకసంఘ ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ బాలాజీనాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పురపాలక సంఘ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. పురపాలక సంఘ ఉద్యోగులు, కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోవర్ధనగిరిలో జాతర చాటింపు


పాలేటమ్మకు నైవేద్యం పెట్టి పూజలు చేస్తున్న మహిళలు

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో ఆదివారం గంగ జాతర చాటింపు వేశారు. ఈ సందర్భంగా సాయంత్రం మహిళలు గ్రామదేవత పాలేటమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. ఈ నెల 3న అమ్మవారి గ్రామోత్సవం, 4న నిమజ్జనం నిర్వహించనున్నట్లు గోవర్ధనగిరి చారిటబుల్ ట్రస్ట్ ప్రకటించింది.

ఘనంగా పాలేటమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పెడుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్ద పాలేడు గ్రామదేవత పాలేటమ్మ దేవతకు ఆదివారం గ్రామస్తులు ఘనంగా పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పాలేటమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదేళ్లుగా వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకుంటూ, పొంగళ్లు పెట్టటం అనవాయితీగా వస్తుందని ఆలయ నిర్వాహకులు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. భారీ స్థాయిలో భక్తులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మనప్రభుత్వం

పిచ్చాటూరు: నాగలాపురం-1 సచివాలయ పరిధిలో సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఎమ్మెల్యే నాగలాపురంలోని ఇందిరానగర్, రాజీవ్ నగర్, సంజీవ్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి అన్నీ శాఖల అధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, గృహ సారథులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

వేడుకగా కన్యకాపరమేశ్వరి జయంతి


పాల కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

పిచ్చాటూరు: నాగలాపురంలో ఆర్యవైశ్యులు వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాల అనంతరం ఆర్యవైశ్య మహిళలు పాల కలశాలతో వేదనారాయణుని ఆలయం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చారు. సాయంత్రం అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్య జోశ్యుల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో కళాకారులు కోమలి, ద్రాసిత, ప్రణతి, కీర్తి, నక్షత్ర, వర్షిణి, పావని, అక్షర, హృతి, కీర్తి, సాహితి, సాహిత్య, ప్రణ్యల ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

రేపటి నుంచి సంస్కార శిబిరం

తిరుపతి కల్చరల్: రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 21వ తేదీ వరకు విద్యార్థుల కోసం సంస్కార శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానందజీ తెలిపారు. ఇందులో వేద మంత్రాలు, భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా, డ్రాయింగ్, పద్య పఠనం, వ్యక్తిత్వ వికాస కథలు, కర్నాటక సంగీతం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలను నేర్పిస్తామని వెల్లడించారు. 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఫీజు రూ.800 చెల్లించాలని సూచించారు.

విజనరీ కాదు.. టెంపరరీ నేత చంద్రబాబు

- పక్కవాడి క్రెడిట్‌ను కొట్టేసే 420 చంద్రబాబు
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పక్కవాడి క్రెడిట్‌ను కొట్టేసే 420 రకం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు విజనరీ కాదని, అతను ఒక టెంపరరీ లీడరన్నారు. ఎవరో చేసిన సహాయాన్ని కూడా తానే చేశానని చెప్పుకునే రకమన్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం విజయవంతం కావడంతో చంద్రబాబునాయుడుకు దిక్కు తోచడం లేదన్నారు. అందుకే పక్క రాష్ట్రం రీల్‌స్టార్‌ను దింపాడని ఎద్దేవా చేశారు. కుటుంబంలో పెద్దదిక్కుగా ఉన్నవారిని మా భవిష్యత్ మీరే అని అంటుంటాం, అలాగే ఈ రోజు మన రాష్ట్రానికి ఒక అన్నలా, తమ్ముడిలా, మనవడిలా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను ప్రతి ఒక్కరూ నువ్వే మా భవిష్యత్ జగన్ అని అంటున్నారని తెలిపారు. ఏపీలో ఉన్న అక్కచెల్లెమ్మలు సొంతిల్లు లేక ఎన్నో కష్టాలు పడుతున్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

విషయం పాదయాత్రలో గుర్తించి 31 లక్షల ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన గొప్ప మనసున్న నేత మన జగనన్న అని అన్నారు. చంద్రబాబునాయుడు పాలనలో ధనవంతులు మరింత ధనవంతులు అయ్యారని, వైఎస్సార్‌సీపీ పాలనలో పేదవారిని ధనవంతులుగా మార్చాలనే తపనతో జగనన్న పాలన అందిస్తున్నారని కొనియాడారు. నాడు ప్రభుత్వ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు.

రజినీకి ఏం తెలుసు..!

ఆంధ్రరాష్ట్ర రాజకీయాలు రజినీకాంత్‌కు ఏం తెలుసని, ఆయనకు అసలు నిజాయితీ అనేది ఉందా అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబునాయుడుకు విజన్ ఉంటే రాజధాని ఎందుకు కట్టలేదన్నారు. రజినీకాంత్ హీరోగా డబ్బు సంపాదించడమే కాకుండా సినీపరిశ్రమలో పనిచేస్తున్న వారిని ఆదుకోవాలనే గుణం ఉండాలని, అది ఆయనకు అసలు లేదన్నారు. దీన్ని బట్టి చూస్తే రజినీకాంత్ ఎలాంటి వాడో అర్థమవుతోందని తెలిపారు. ఎన్టీ రామారావును నమ్ముకున్న ప్రతి ఒక్కరినీ ఆయన ఉన్నతస్థానాలకు తీసుకెళ్లారని, ఆయనకు ఏమాత్రం రజినీకాంత్ సాటి కాదన్నారు. నమ్ముకున్న వారికి సాయం చేయలేని రజినీకాంత్ ముసలి నేత చంద్రబాబునాయుడు గురించి గొప్పలు చెప్పడం ఎంతవరకు సబబు అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజధాని పేరుతో తాత్కాలిక భవనాల కోసం వేలకోట్లు ఖర్చు చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఒంటరిగాననే పార్టీని నడిపించారన్నారు. రజినీకాంత్ ఒక కార్పొరేటర్‌ను కూడా పోటీచేయనివ్వని భయస్తుడన్నారు. జగనన్న గురించి మాట్లాడితే ఆంధ్రరాష్ట్రంలో ప్రజలు రజినీకాంత్‌ను వదలి పెట్టరన్నారు. త్వరలోనే రజినీకాంత్ ఎంత తప్పు చేశాడో అతనే తెలుసుకుంటారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు.

సంక్షేమం అర్హులందరి హక్కు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: కుల, మత, రాజకీయాలకతీతంగా రాష్ట్రంలో సంక్షేమాన్ని అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి ఫలాలను పొందడం అర్హులందరి హక్కని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని కసిమ్మిట్ట ఆది ఆంధ్రవాడలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు. ఆదిఆంధ్రవాడ వాసులతో ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పొందిన ఫలాలతో ఆర్థికంగా కుటుంబం ఎదగాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా, చేయూత, తోడు తదితర పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధిపై శ్రద్ధ చూపాలన్నారు. జగనన్న పేదలకు పక్కా గృహాల పథకంలో నిర్మించుకున్న ఇళ్లను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నడివీధి గంగమ్మ వద్ద నిర్వహించిన ప్రత్యేకపూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ కోనేటి బాబు, సర్పంచ్‌లు శశికళ, మురుగేశం, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత దివ్యాంగ శిబిరానికి స్పందన



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదేశాలతో శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దివ్యాంగ శిబిరానికి విశేష స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మూడు చక్రాల సైకిళ్లు, కృత్రిమ కాళ్లు, చెయ్యి వంటివి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఉచితంగా ఇంత పెద్దశిబిరం ఏర్పాటు చేసిన గురుదేవ చారిటబుల్ ట్రస్టు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిఒక్కరూ తమ జీవితంలో పక్కవారికి సేవలు చేయడం అలవరచుకోవాలని సూచించారు. అలాగే దివ్యాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ఏసాయం కావాలన్నా చేయడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీవనాధార వికలాంగుల సేవాసంఘం అధ్యక్షుడు రవి, వయ్యాల కృష్ణారెడ్డి, ఊరందూరు రంగయ్య, కోటేశ్వరరావు, సంజీవ్, వినోద్, మనోజ్, లోకేష్, విజయ్, మణి, నరేంద్ర, చెంచుకృష్ణ, సునీల్‌కుమార్, డిల్లీబాబు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మకు పొంగళ్లు


పొంగళ్లు పెడుతున్న మహిళలు

పిచ్చాటూరు: మండల కేంద్రంలో ఆదివారం మహిళలు గ్రామ దేవత గంగమ్మకు పొంగళ్లు పెట్టారు. సాయంత్రం 6 గంటలకు మహిళలు గంగమ్మ ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పూజారి సంప్రదాయ బద్ధంగా ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. రైతులు పండించిన తొలి పంట ఇంటికి చేరుకునే సమయంలో గ్రామదేవతకు పొంగళ్లు పెట్టడం గ్రామంలో సంప్రదాయంగా వస్తుందన్నారు. అందులో భాగంగా ఆదివారం పొంగళ్లు పెట్టి, అమ్మవారిని కొలిచినట్లు సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి తెలిపారు.

ఆగమోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం


అభిషేకం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం చిన్నకొట్టాయి ఉత్సవం ఆగమోక్తంగా జరిగింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ఆవరణలోని పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. మొదట స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. చతుర్వేద పారాయణం, మంత్రపుష్పం, నైవేద్యం, దీపారాధన, హారతి నిర్వహించారు. అనంతరం ఆలయంలోనే స్వామి అమ్మవార్లను ఊరేగించారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుని సేవలో కృష్ణా జిల్లా డిప్యూటీ కలెక్టర్


డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం దంపతులకు ఆలయ మర్యాదలు చేస్తున్న చైర్మన్ బాలాజీ రెడ్డి

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లిలోని పల్లికొండేశ్వరస్వామి వారిని కృష్ణా జిల్లా డిప్యూటీ కలెక్టర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న డిప్యూటీ కలెక్టర్ దంపతులకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన రుద్రాభిషేకంలో వారు పాల్గొని, స్వామివారికి పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు పలికారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ దంపతులకు ఆలయమర్యాదల మేరకు కండువా కప్పి, సత్కరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: ఒకరి రక్తం ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందని యువతరం సేవాసమితి సభ్యులు అన్నారు. పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో పట్టణ పేదరిక నిరాశ్రయుల వసతిగృహంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం చాలా అవసరమన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు. గర్భిణీలు, ప్రమాదాల బారిన పడినవారికి, అనేకమంది వ్యాధిగ్రస్తులకు రక్తం అవసరమని అన్నారు. సుమారు 100 మంది ఎండలను సైతం లెక్కచేయకుండా రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మెగా ఇంజినీరింగ్ జనరల్ మేనేజరు మల్లికార్జున రావు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు మోహన్‌రెడ్డి, సిబ్బంది, రుయా, ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది రాజేశ్వరరావు, కల్పన, గరికపాటి రమేష్‌బాబు, యువతరం సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా నాడు-నేడు పనులు


మోల్డింగ్ పనులను ప్రారంభిస్తున్న అధికారులు

పిచ్చాటూరు: మండలంలోని పులికుంద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.85 లక్షలు మంజూరు చేసింది. ఆదివారం ఉదయం భవన నిర్మాణంలో భాగంగా మోల్డింగ్ పనులు చేపట్టారు. పనులను పులికుంద్రం ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, పీసీ చైర్మన్ దొరైరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రారంభించారు. మరో 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్బర్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


దొరైరాజ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మస్యం శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన దొరైరాజ్ మృతదేహానికి ఆదివారం వైఎస్సార్‌సీపీ తారకరామానగర్ ఇన్‌చార్జ్ మస్యం శ్రీనివాసులు రెడ్డి(ఎంఎస్‌ఆర్), పార్టీ నాయకులు నివాళి అర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పంపిన తక్షణ సాయం కింద రూ.10 వేలు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ తరపున అన్నివిధాలా తోడుంటామని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమూర్తి, రమేష్, షేక్ తహసీనా, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లి వద్ద ఆదివారం కారు ఢీకొని ఇద్దరు యువతులకు తీవ్ర గాయాలయ్యాయి. రంగంపేటకు చెందిన తేజశ్రీ, శశికళ స్కూటర్‌పై తిరుపతికి బయలుదేరారు. నాగయ్యగారిపల్లి వద్ద తిరుపతి నుంచి మదనపల్లికి వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన యువతులను స్థానికులు అదే కారులోనే రుయాకు తరలించారు. చంద్రగిరి ఎస్‌ఐ వంశీకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గజవాహనంపై అగస్త్యేశ్వరుడు


గజ వాహన సేవలో అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆదివారం రాత్రి గజవాహనంపై విహరించారు. ఉదయం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం నిత్య పూజాధి కైంకర్యాలు పూర్తి చేసిన అనంతరం ఉత్సవమూర్తులనుఉ సుందరంగా అలంకరించి గజ వాహనంపై కొలువు దీర్చారు. అనంతరం మేళ తాళాలు, కోలాటాల మధ్య స్వామి వారు సముదాయం వీధుల్లో విహరిస్తూ హారతులను అందుకున్నారు. ఏఈవో మోహన్, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకల్, జమేదార్ విజయకుమార్ పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో ఏడో రోజు సోమవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించాల్సి ఉంది. అయితే ఆలయానికి రథం లేనందున సర్వభూపాల వాహనాన్ని అలంకరించి ఊరేగించనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు


విద్యుత్ దీపాల వెలుగులో ఆలయం

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ పాలక మండలి, దేవాదాయశాఖాధికారులు నిర్ణయం తీసుకున్నారు. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఒకటో తేదీన నుంచి 6వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒకటో తేదీన అంకురార్పణ, 2న తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, శేషవాహన సేవ, 3న హనుమంతు సేవ, 4న లక్ష్మీనరసింహస్వామి వారి జయంతిని పురస్కరించుకుని అన్నదానం, గరుడవాహనసేవ, 5న స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, అన్నదానం, గజవాహనసేవ, 6న చక్రస్నానం, ఏకాంత సేవతో బ్రహోత్సవాలు ముగింపు జరుగుతుందని ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రుల కావాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మ జాతర ప్రారంభం

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పోలేరమ్మ ఘటానికి దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వాహకులు పూజలు చేశారు. తొలుత శెట్టిపల్లివారివీధిలోని పోలేరమ్మ అలంకార గుడి వద్ద గ్రామపెద్దలతో పాటు పెద్దకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డితో పాటు పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, కమిటీ సభ్యులు, స్థానిక దేవదాయ శాఖ అధికారులు, తదితరులు కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఘటాన్ని పట్టణ సరిహద్దులో ఊరేగించారు. అలాగే పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పంచిపెట్టారు.

కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం రేపు


ఆలయంలో వేస్తున్న చలువ పందిళ్లు

పిచ్చాటూరు: నాగలాపురంలో ఉన్న వేదనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు. మే 4 నుంచి 12వ తేదీ వరకు వేదనారాయణస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు భక్తులను ఆలయంలోనికి అనుమతిస్తారు.

4 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుండి 12వ తేదీ వరకు వేడుకగా జరగనున్నాయని టీటీడీ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 4న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 5న ఉదయం చిన్న శేష వాహనం, సాయంత్రం హంస వాహన సేవ జరుగుతుందన్నారు. అలాగే 6వ తేదీ ఉదయం సింహవాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సాయంత్రం సర్వభూపాల వాహనం, 8న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. 9న ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 10న ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ, 11న ఉదయం రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, అశ్వవాహనం, 12న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. బ్రహోత్సవాలకు ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు వేసి, పుష్పాలంకరణ చేస్తున్నారు.

సర్కారు తోడు.. అభివృద్ధి వైపు ఏర్పేడు



ఏర్పేడులో బీఎంఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్మశానంలో బోరు వేస్తున్న సర్పంచ్ శివయ్య

మేజర్ పంచాయతీ ఏర్పేడు అభివృద్ధి పథం వైపు నడుస్తోంది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న నిధులతో సర్పంచ్ నల్లపాలెం శివయ్య గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దారు. సుమారు రూ.21.5 లక్షలతో ఏర్పేడు పాత బస్టాండు సమీపంలో 6 నూతన గదులను బీఎంఎస్సార్ పేరుతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అలాగే పంచాయతీ పరిధిలోని 5 శ్మశానాలను చదును చేసి కొత్తబోర్లు వేసి వాటికి చేతిపంపులు అమర్చి నీటి సమస్య పరిష్కరించారు. నూతనంగా 46 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలు పరిష్కరించారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచారు. సర్కారు తోడు అందిస్తుండడంతో ఏర్పేడు అభివృద్ధి పథకంలో దూసుకెళ్తోంది.

-ఏర్పేడు

సంగీత సామ్రాట్ ఘంటసాల

తిరుపతి కల్చరల్: తన మధుర కంఠస్వరంతో గానం చేసి ప్రజల గుండెల్లో నిలిచిన సంగీత సామ్రాట్ ఘంటసాల అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఘంటసాల శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో చేపట్టిన రెండు రోజుల అమృత గాన నీరాజనం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సినిమా సంగీతంలో రారాజుగా వెలుగొందిన వ్యక్తి ఘంటసాల అని తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి గర్భాలయం ముందు అన్నమయ్య తర్వాత పాట పాడిన ఏకైక వ్యక్తి ఘంటసాల అని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, పారిశ్రామిక వేత్త పీసీ.రాయులు ఘంటసాల సంగీతం గురించి కొనియాడారు. గాయనీ గాయకులను సత్కరించారు. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, ప్రసాద్‌రావు, శాంతావాణి పాల్గొన్నారు.

పిరమిడ్ అద్భుత శక్తి క్షేత్రం

నాయుడుపేటటౌన్: పిరమిడ్ అంటే కంటికి కనిపించే నాలుగు సమాన త్రిభుజాలను కలిపి చేసిన నిర్మాణం మాత్రమే కాదని, అది ఒక అద్భుత శక్తి క్షేత్రమని బ్రహ్మర్షి పత్రిజీ కుమార్తె పరిణీత పత్రి, కడ్తాల్ కైలాసపురి ట్రస్టు సభ్యులు బాలకృష్ణ అన్నారు. పట్టణంలోని రజక కాలనీలో నూతనంగా నిర్మించిన మిత్రబంధు పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. పిరమిడ్‌లో ధ్యానంతో కలిగే లాభాలపై సందేశమిచ్చారు. భీమవరం నగరానికి చెందిన ధ్యానరత్న పిప్పళ్ల ప్రసాద్‌రావు బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక సంగీత విభావరి అందరిని ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పిరమిడ్ ధ్యాన మందిరంలో రోజూ ఉచిత ధ్యాన తరగతులు నిర్వహించనున్నట్లు మైత్రేయ బద్ధ పిరమిడ్ ధ్యాన సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు.